
'అప్పుడే ఆరు దాటిందా! కాస్త ముందుగా లేవాలనుకుంటే ఏమిటో మెలకువే రాలేదు. ఈమధ్య తెల్లవారుజామునే బాగా నిద్రపడుతోంది. వయసు ప్రభావం కాబోలు! ఏం చేస్తాం! ఇంకా నయం. ఏడింటిదాకా పడుకున్నాను కాదు. ఈరోజు ఎలాగైనా ఆ పని మొదలుపెట్టాలి' మంచం దిగి ఎదురుగా గోడమీద ఉన్న దేవుడి పటానికి దండం పెట్టుకుంది కామాక్షి. పక్కనే ఇంకా ముసుగుపెట్టి నిద్రపోతున్న పతిదేవునికి మెలకువ రాకుండా పక్కగదిలోకి వచ్చి టేబుల్ దగ్గర ఉన్న కుర్చీలో కూర్చున్నదో లేదో వీధి తలుపు చప్పుడయింది.

అయ్యో! పాలవాడు వచ్చినట్లున్నాడు. కవర్ పెట్టినా పాల పాకెట్లు కవర్‌లో వేయడు. వెంటనే చూడకపోతే ఏ పిల్లులయినా రావచ్చు. లేదా లీక్ అవుతున్న పాకెట్లయినా వేసి పోతాడు అనుకుంటూ లేచి తలుపు తీసి గుమ్మంలో ఉన్న పాల పాకెట్లు తీసి లోపల పెట్టింది. మళ్లీ గదిలోకి వచ్చి రాగానే చెత్తబండివాడు వచ్చినట్లుగా బండికి వున్న గంటమోతతోపాటుగా "అమ్మా! చెత్తమ్మా!" అన్న వాడికేక ఒకేసారి వినబడ్డాయి. వీడొకడు! గంట మోగిస్తే సరిపోతుంది కదా! చెత్తమ్మా అంటూ తిట్టినట్లుంటుంది వీడి పిలుపు! ఇంత పొద్దున్నే తగలడ్డాడేమిటో! అని లోపల లోపల గొణుక్కుంటూ చెత్తబుట్ట తీసుకువెళ్లి గేటు బయట పెట్టింది. ఇంటింటికి వచ్చి చెత్తంతా సేకరించుకుని వెళ్ళేవాడు ఒక్కరోజు రాకపోతే వాడిని ఎంత తిట్టుకుంటుందో అప్పుడు గుర్తుకు రాలేదు కామాక్షికి. ఇవాళ ఎలాగైనా సరే ఆరు నూరయినా, నూరు ఆరైనా అనుకున్న పని చేసి తీరాల్సిందే! ఆసక్తి ఉండాలేగాని ఎప్పుడైనా మొదలుపెట్టొచ్చునట.



# కంచికి చేరిన కామాక్షి కథ

-అబ్బరాజు జయలక్ష్మి


యాభైఏళ్లు దాటిన తరువాత ఆడవాళ్లు కూడా ఎందరో ఈ వ్యాపకంలో ఉన్నారుట. తను కూడా తన కోరికను నెరవేర్చుకోవాలి. ఎంతసేపూ ఇంటికి, ఇంకా చెప్పాలంటే వంటింటికే అంకితమైపోయింది తను. ఆమె ఆలోచనలను భంగపరుస్తూ "అమ్మగారూ! అంట్లేయండి!" అన్న అచ్చమ్మ పిలుపు వినపడింది. దీనికప్పుడే తెల్లవారిందేమిటో ఇవ్వాళ! అనుకుంటూ అంట్ల గిన్నెలు వేసి వంటగది శుభ్రం చేసుకుని స్నానానికి వెళ్లింది.

అదే అచ్చమ్మ ఎప్పుడైనా ఒక అరగంట ఆలస్యంగా వస్తే దానిమీద కారాలు మిరియాలు నూరుతూ గడియకోసారి గడియారం వంక చూస్తూ ఇంట్లోకి, వాకిట్లోకి కాలుగాలిన పిల్లిలా తిరుగుతూ ఉండటం కామాక్షికి అలవాటే! కాని ఈరోజు ఆమె మనసంతా ఇంటిపనుల మీదకంటే తను సాధించబోయేపని మీదే ఉంది మరి! కామాక్షి స్నానం, పూజ పూర్తయ్యేసరికి భర్త ఈశ్వరరావు నిద్రలేచి దంతధావనం గావించి పేపర్ చదువుతూ కాఫీ కోసం నిరీక్షిస్తున్నాడు.



## గ్లామర్‌కు చిట్కాలు

తమన్నా గ్లామరస్‌గా వుంటుందని అందరూ ఒప్పుకున్న విషయమే. తన గ్లామర్ రహస్యాన్ని చెప్పడం మాట అలా వుంచి, తన సహచర నటీమణులకు అందానికి సంబంధించిన క్లాసులు మాత్రం ఈమధ్య తెగ తీసుకుంటోందిట. ముఖం కళకళలాడుతూ ఫ్రెష్‌గా కనిపించాలంటే విటమిన్ సి, ఇ వున్నవి ఎక్కువగా తినాలని సలహాలిస్తోందిట.



"కాఫీ పెట్టావా కామాక్షీ!" అంటూ పలకరించాడు.

"లేచారా! ఇదిగో ఇప్పుడే పెట్టిస్తా!" అంటూ వంటగదిలోకి అడుగుపెట్టింది. అలా నడుం బిగించి మొదలుపెట్టిన వంటింటి పని కాఫీ టిఫిన్లు, తరువాత వంట కార్యక్రమం, తదుపరి భోజనాలు పూర్తయ్యేవరకు నిర్విరామంగా సాగుతూనే ఉంది.

మధ్యాహ్నం నడువాల్చటం అలవాటున్న కామాక్షికి ఆరోజు పడుకోవాలనిపించలేదు. విశ్రాంతి సమయాన్ని చక్కగా వినియోగించుకుని తన పనికి శ్రీకారం చుట్టాలనుకుంది.

"కామాక్షమ్మ వదినా!" అంటూ వచ్చింది పక్కింటి పార్వతమ్మ.

"ఏం లేదు వదినా! రా!" అంటూ ఇప్పుడే రావాలా ఈవిడ! ఇక తన పని అయినట్లే! ఆవిడ చెప్పే ఇచ్చకాల ముచ్చట్లు వినే తీరిక తనకు లేదు. ఇలా కబుర్లు చెప్తూ కూర్చుంటే తన కోరిక తీరేదెలా? తను అనుకున్నది సాధించేది ఎలా? అనుకుని వెళ్లమని చెప్పలేక ఆవిడ చెప్పే లోకాభిరామాయణం వింటూ ముక్తసరిగా 'ఊ', 'ఆ' అంటూ కూర్చుంది.

అయినా పార్వతమ్మ ఇలాంటివన్నీ పట్టించుకునే మనిషి కాదు. ఇరుగు పొరుగు గురించిగాని, వార్తల్లో ఉన్న కొత్త విషయాలుగాని ఎవరితోనయినా చర్చిస్తేగాని ఆవిడకు తృప్తిగా ఉండదు. పార్వతమ్మను ఎలాగో పంపించేసరికి ఈశ్వరరావు మధ్యాహ్నం నిద్రపూర్తయి లేవటం కూడా అయింది.

"కామాక్షీ! తినటానికి ఏం పెడుతున్నావు?" అని అడిగాడు. టైమ్ చూస్తే నాలుగున్నరయింది. పడుకుని లేచాక సాయంత్రంపూట ఏదో ఒకటి తినటానికి కావాలి ఈశ్వరరావుకు. కామాక్షి జవాబిచ్చేలోగానే...

"ఇదిగో! నాకోసం కష్టపడి ఇప్పుడు ఏం టిఫిన్ చేస్తావులే! కాసిని మరమరాలు, పుట్నాలపప్పు, ఉప్పు, కారం వేసి కలిపి టమోటాలు, ఉల్లిపాయ ముక్కలు కలిపి, ఆ చేత్తోనే అందులో కొంచెం నిమ్మరసం పిండి, కాస్తంత కొత్తిమీర చల్లి ఇవ్వు చాలు" అన్నాడు ఈశ్వరరావు సోఫాలో రిలాక్స్‌గా కూర్చుని టివి రిమోట్ చేతిలోకి తీసుకుంటూ.

'ఆహా! ఏంత బాగా చెప్పారో! చెప్పటం తేలికే! చెయ్యటంలోనే ఉంది అంతా. టమోటాలు, ఉల్లిపాయలు, కొత్తిమీర సన్నగా తరగాలి. నిమ్మకాయ కోసి చెక్కనుండి రసం పిండాలి. అన్నీ కలపాలి. దీనికంటే ఏ పకోడీ లయినా చిటికెలో చేసెయవచ్చు. ఫ్రిజ్‌లో ఉన్న పిండి తీసి రెండు దోసెలైనా రెండు నిమిషాలలో వేసెయవచ్చు.

అయినా రిటైరయినప్పటినుండి టివికి అతుక్కుపోయినట్లు అన్ని కార్యక్రమాలు ఏకబిగిన చూసేయటమే లక్ష్యంగా ఉంది ఈయనకు. ముఖ్యంగా ఆ 'ఇంటింటి వంట' కార్యక్రమం క్రమం తప్పకుండా చూడటం. రోజుకో కొత్తరకం వంట చెయ్యమని వెంటపడటం ఎక్కువయింది. పోనీలే వయసు పైబడితే జిహ్వాచాపల్యం పెరుగుతుంది అంటారు కదా అని అవన్నీ చేసి పెడుతూనే ఉంది తను. అన్నిటిని మించి 'సలాడ్స్' పేరుతో పచ్చికూరలు మేయటం మొదలైంది ఈ మధ్య. అదేమంటే ఆరోగ్యానికి మంచిది అని అందరూ వేనోళ్ల వివరిస్తున్నారు. నువ్వు కూడా తిని చూడు. మరీ వట్టి కాయగూరలు కొరుక్కుని తినలేం గాబట్టి ఇలా సన్నగా ముక్కలు తరిగి సలాడ్‌లాగా చేసుకుని పైన ఏ పెప్పరు పొడో చల్లుకుని తింటే టేస్టుకు టేస్టు ఆరోగ్యానికి ఆరోగ్యం' అంటూ ఆపకుండా చెప్పగలడు ఈశ్వరరావు.

***

రాత్రి 9 గంటలైంది. భోజనం ముగించి వక్కపొడి నములుతూ ఒక్కొక్క ఛానలే మారుస్తూ టివి ముందు కూర్చున్నాడు ఈశ్వరరావు.

కామాక్షికి మాత్రం చాలా చిరాకుగా ఉంది. ఉదయంనుండి ప్రయత్నిస్తుంటే రోజంతా గడిచిపోయిందిగాని ఇంతవరకు తనకు సమయమే దొర

కలేదు. ఇప్పుడైనా మొదలుపెట్టాలి అని అనుకుంటూ ఉండగానే హాల్లో ఉన్న ఫోన్ 'ట్రింగ్..ట్రింగ్' అంటూ మోగటం మొదలైంది.

"కామాక్షీ! ఫోన్ చూడు!" అంటూ కేకేశాడు టివిలో వస్తున్న పాటల పల్లకీ ప్రోగ్రాంలోని పాటలను మైమరచి వింటున్న ఈశ్వరరావు.

'మీరే తీయొచ్చుగా!' అనబోయి, అది అమెరికాలో ఉన్న కూతురు అనూ ఫోను అయుంటుంది అనుకుంటూ ఫోన్ దగ్గరకు వెళ్ళింది కామాక్షి.

కామాక్షి, ఈశ్వరరావు దంపతులకు ఒక్కగానొక్క కూతురు అనూరాధ. అమెరికాలో అల్లుడికి ఉద్యోగం. 'కొన్నాళ్ళు పోయాక తిరిగి ఇండియాకి వచ్చేస్తాం' అన్నారు. అది ఎంతవరకు జరుగుతుందో తెలీదు. ప్రతిరోజూ ఫోన్‌లో మాట్లాడనిదే మనసుండబట్టదు ఇద్దరికీ.

"ఏమ్మా! అనూ! ఎలా వున్నావు? అల్లుడుగారు బాగున్నారా? మన వడు ఏవంటున్నాడు?" అంటూ పలకరింపుతో మొదలుపెట్టిన ఆ ఫోన్ సంభాషణ భార్యాభర్తలిద్దరూ కూతురు అల్లుడుతో మాట్లాడటం పూర్తయ్యే సరికి రాత్రి పదిగంటలయింది. అమ్మయ్య! ఇక ఏ ఆటంకాలు లేకుండా మొదలుపెట్టి చకచకా పూర్తి చేయాలి' అని గదిలోకి వెళ్ళి టేబుల్ దగ్గర ఉన్న కుర్చీలో కూర్చుంది కామాక్షి. ప్యాడ్‌కి వైట్ పేపర్స్ పెట్టుకుని పెన్ను చేతిలోకి తీసుకుంది. కామాక్షికి పుస్తకాలు చదవటం బాగా అలవాటు. అలా కథలు చదువుతున్నప్పుడల్లా కథలు వ్రాయటం ఇంత సులభమా? నేను కూడా ఎందుకు రాయకూడదు? అనుకునేది. ఆ సంకల్పం చివరికి దృఢ నిశ్చయంగా మారి ఈసారి ఉగాది కథల పోటీకి ఎలాగైనా ఒక కథ రాసి పంపాలి' అనే ఆలోచన కలిగింది. 'రాయాలి. ఎలాగైనా సరే తను ఒక కథ రాయాలి. ఆ కథను పత్రికకు పంపించాలి. పత్రికలో అచ్చయిన తన పేరుతో ఉన్న కథను చూసుకోవాలి' ఆలోచనలు మెదడు నిండా ముసురు కుంటున్నాయి కాని కామాక్షి చేతిలో ఉన్న కలం మాత్రం కదలటం లేదు. ఇదేమిటి? తీరా రాద్దామని కూర్చుంటే ఒక్కటీ గుర్తుకు రావటంలేదే! ఏం రాయాలి? ఎలా రాయాలి?' అని ఆలోచిస్తూ కూర్చున్న కామాక్షి దగ్గ రకు- "ఏంటి ఇంకా పడుకోలేదా?" అంటూ వచ్చాడు ఈశ్వరరావు.

భర్త పిలుపుతో ఉలిక్కిపడిన కామాక్షి ఉసూరుమంటూ ఉదయంనుండి తను కథ రాయాలని ఆరాటపడటమూ, అందుకు సమయం చిక్కకపోవ టమూ, తీరా ఇప్పుడు రాయాలంటే ఒక్క అక్షరం కూడా కాగితం మీద పెట్టలేకపోవడం అన్నీ చెప్పింది కామాక్షి.

అంతా విన్న ఈశ్వరరావు కామాక్షి పక్కనున్న కుర్చీలో కూర్చుంటూ "అసలు ఏం కథ రాయాలనుకున్నావు? కథా వస్తువు ఏమిటి? ఎలా మొద లుపెట్టాలనుకున్నావు? కొసమెరుపు ఏమిటి?" అంటూ ప్రశ్నించాడు.

"ఆగండాగండి! ఒక్కసారే అన్ని ప్రశ్నలైతే ఎలా? కథ రాయటం వెనుక ఇంత కమామిషు ఉన్నదా?"

"అవును! కథ రాయాలనుకోగానే సరికాదు. దానికి తగిన థీమ్‌ని దాని ద్వారా పాఠకులకు నువ్వు చెప్పదలుచుకున్న సందేశమో, వినోదమో, విజ్ఞానమో ఏదో దానిని నిర్ణయించుకోవాలి. అందుకు అనుగుణంగా పాత్రల రూపకల్పన జరగాలి. వాటిద్వారా సంభాషణలు పలికించాలి. కథనం అంటే శైలి పాఠకులకు ఆసక్తికరంగా ఆసాంతం చదివించేలా ఉండాలి. కథకు తగిన ప్లాట్, ప్లానింగ్ మైండ్‌లో ఉంటే పేపర్‌మీద పెన్ను పెట్టగానే అవలీలగా ముందుకు సాగిపోతుంది. అప్పుడు నీకు ఎక్కువ సమయం కూడా పట్టదు. అందుకే ముందు మేథోమథనం జరగాలి. అందులోనుండి అద్భుతమైన రచనలు ఆవిర్భవిస్తాయి"

"ఎంత బాగా చెప్పారండీ! మీకిన్ని సంగతులు ఎలా తెలుసు?" అంటూ ఆశ్చర్యంగా అడిగింది కామాక్షి.

"కాలేజీ రోజుల్లో నాకో రచయిత ఫ్రెండ్ ఉండేవాడు. అతడు కథల గురించి అప్పుడప్పుడూ మాట్లాడుతూ ఉండేవాడు. అందుకే ఈ విషయాలన్నీ నేను నీకు చెప్పగలిగాను"


"కథ రాయాలని ఉబలాటపడ్డాను కాని ఇంత తతంగం ఉన్నదని తెలియదు" అంటూ నిట్టూర్చింది కామాక్షి.

"నువ్వు అంత నిరాశపడవలసిన పనిలేదు కామాక్షీ! ఈసారినుండి నువ్వు కథలు చదివేటప్పుడు 'కథలు ఎలా రాస్తారు?' అనే పరిశీలనా దృష్టితో చదివితే నీకు కూడా కథలు రాసే విధానం అలవడుతుంది. ఇక చాలుగానీ పడుకో పొద్దుపోయింది" అంటూ లేచాడు ఈశ్వరరావు.

"అవునండీ! అప్పుడే పదకొండు గంటలయింది. నిద్ర ముంచుకొస్తోంది" అంటూ లేచి ఆవులిస్తూ మంచం వైపు కదిలింది రచయిత్రి కావాలని కలలు కనే కామాక్షి.

ఆవిధంగా రాయకుండానే కామాక్షి కథ కంచికి చేరింది.

☆



## ఆర్ ది బెస్ట్

'లగాన్', 'మున్నాభాయ్ ఎంబిబిఎస్' లాంటి బంపర్ హిట్ సినిమాల హీరోయిన్ అయినా గ్రేసీ సింగ్ కెరీర్ మాత్రం నత్తనడకనే సాగింది. అలాగే తెలుగులో ఆమె తొలిచిత్రం 'సంతోషం' కూడా హిట్ చిత్రమే. కానీ గ్రేసీకి చెప్పుకోదగిన ఆఫర్లు రాలేదు. మళ్లీ ఇన్నాళ్లకి గ్రేసీ ఓ తెలుగు సినిమాలో నటిస్తోంది. ఇందులో అబ్బాస్ హీరోగా నటిస్తున్నాడు. హిందీలో ఎలాగూ అవకాశాలు లేవు, తెలుగులో అయినా ఆమె దశ తిరుగుతుందేమో చూడాలి!

